సాక్షి నంద్యాల

బుధవారం । 18 । డిసెంబర్ । 2024



విద్యార్థుల జీవితాల్లో నవోదయం

బనవాసి నవోదయ విద్యాలయంలో అత్యుత్తమ విద్యా బోధన ఉంటుంది. ఇందులో సీటు వచ్చిందంటే చాలు తమ బిడ్డ భవిత బంగారమేనని తల్లిదండ్రులు భావిస్తారు. - 8లో



అలరించిన సంప్రదాయ నృత్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై మంగళవారం తిరుపతి నటరాజ ఆర్ట్స్ అకాడమీ కళాకారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,628.86
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 90.012
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 2,395
అవుట్ ఫ్లో	: 6,467

న్యూస్‌రీల్

వైభవంగా ధనుర్మాస పూజలు



ప్రత్యేక అలంకరణలో గోదాదేవి

ఆళ్లగడ్డ: దిగువ అహోబిలంలో ధనుర్మాస పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ప్రత్యేక అర్చన, హారతి, పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులైన శ్రీదేవి భూదేవి సహిత శ్రీ ప్రహ్లాద వరదస్వామితోపాటు గోదాదేవి అమ్మవారిని యాగశాలలో కొలువుంచి వేదపండితుల వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ నవకలశ స్థాపన, పంచామృతాభిషేకం, తిరుమంజనం, అర్చన నిర్వహించారు. ఉత్సవమూర్తులను నూతన పట్టు వస్త్రాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉత్సవమూర్తి గోదాదేవిని ప్రత్యేక గుడిలో కొలువైన మూలవిరాట్ గోదాదేవి అమ్మవారి సన్నిధికి తోడ్కొని వచ్చి కొలువుంచారు.

నేడు కిసాన్ మేళా

నంద్యాల(రూరల్): పట్టణంలోని నూనెపల్లె ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో బుధవారం కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ సహాయ పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎం.జాన్సన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. పరిశోధనా స్థానం నుంచి అభివృద్ధి పరచిన నూతన వంగడాలు, ఇతర సాంకేతిక పద్ధతుల ప్రదర్శనతో పాటు క్షేత్ర సందర్శన కార్యక్రమం, రైతు-శాస్త్రవేత్తల ముఖాముఖి వంటి పలు అంశాలు ఉంటాయన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రతినిధులు, ఇతర వ్యవసాయ అనుబంధ రంగాల నిపుణులతో పాటు జిల్లాలోని రైతులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

శ్రీశైలం నుంచి 12,989 క్యూసెక్కుల నీరు విడుదల

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైల జలాశయం నుంచి మంగళవారం దిగువ ప్రాజెక్టులకు 12,989 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తెలంగాణ ప్రాంతంలోని ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో 3.460 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి దిగువ నాగార్జునసాగర్‌కు 7,394 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అలాగే బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 1,500 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 1,695 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు కేంద్రంలో పంప్‌మోడ్ ఆపరేషన్ ద్వారా 8,350 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి మళ్లించారు. ప్రస్తుతం డ్యాంలో 116.9200 టీఎంసీల నీరు నిల్వ ఉండగా నీటి మట్టం 863.40 అడుగులకు చేరుకుంది.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యాన శాఖ జిల్లా అధికారి నాగరాజు

కోవెలకుంట్ల: జిల్లాలో ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం కల్పిస్తోందని ఆ శాఖ జిల్లా అధికారి నాగరాజు అన్నారు. మంగళవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మామిడి తోటల పెంపకానికి రూ. 13,300, జామ తోటలకు రూ. 29,335, డ్రాగన్ ఫ్రూట్స్‌క్ కు రూ. 50 వేలు, అల్ల నేరేడుకు రూ. 30 వేలు, చీని తోటలకు రూ. 16 వేలు, మల్చింగ్ పేపర్‌కు రూ. 16 వేలు, హైబ్రిడ్ కూరగాయలకు రూ. 20 వేలు, మిరప ఐపీఎంకు రూ. 1200, పూలతోటల సాగుకు రూ. 16 వేలు సబ్సిడీ రూపంలో అందజేస్తోందన్నారు. రైతులు సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆయా పంటల్లో అధిక దిగుబడులు సాధించి లాభాలు గడించాలన్నారు. ఉద్యాన శాఖ అధికారులు, రైతు సేవా కేంద్ర సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడూ సూచనలు, సలహాలు అందజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారిణి ధరణి, సిబ్బంది పాల్గొన్నారు.





కర్నూలు పెద్దాసుపత్రిలోని మాతాశిశు భవనం

అమ్మ చావుకేక!

తల్లి...బిడ్డకు జన్మనిస్తూ మరణించకూడదు... జన్మిస్తూ ఏ శిశువు కన్ను మూయకూడదు. కానీ క్షేత్ర స్థాయిలో ఇందుకు విరుద్ధంగా జరుగుతోంది. గర్భిణి ప్రసవమయ్యే వరకు గ్యారెంటీ లేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆమెకు నిత్యం ఏదో ఒక అనారోగ్య సమస్య వెంటాడుతూ ఉంటోంది. గతంలో వ్యక్తిగతంగా ఏఎన్ఎంలు, ఆశాలు గర్భిణులను ఆసుపత్రికి తీసుకొచ్చి చికిత్స చేయించేవారు. ఇప్పుడు ఎక్కడా ఆ పరిస్థితి కనిపించడం లేదు. కనీసం ఆరోగ్య సంబంధ అంశాలపై సలహాలు, సూచనలు కూడా లేవు. ఫలితంగా అనారోగ్య సమస్యలు పెరిగి గర్భిణులు ప్రసవ సమయంలో మృత్యువాతపడుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ మూడునెలల కాలంలోనే 16 మంది కన్నుమూశారు. ఈ మాతృ మరణాలపై దృష్టి సారించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మూడు నెలల్లో 16 మంది గర్భిణులు మృతి

- రక్తహీనత, బీపీతో పాటు వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు
- నామమాత్రంగా వైద్యసేవలు
- క్షేత్రస్థాయి నుంచి సరైన పర్యవేక్షణ చేస్తే మరణాలు అరికట్టే అవకాశం
- ఆ దిశగా దృష్టి సారించని అధికారులు
- మాతృ మరణాలపై తూతూమంత్రంగా సమీక్షలు

కర్నూలు(హాస్పిటల్)/గోస్పాడు: ఉమ్మడి కర్నూలు జిల్లాలో 91 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 16 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఎమ్మిగనూరు, ఆదోనిలో మాతాశిశు ఆసుపత్రులు, డోన్, ఆళ్లగడ్డలలో ఏరియా ఆసుపత్రులు, కర్నూలు, ఆదోని, నంద్యాలలో జనరల్ హాస్పిటల్స్ ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రతి సంవత్సరం 90వేల నుంచి 95వేల దాకా ప్రసవాలు జరుగుతున్నాయి. మహిళ 12 వారాల గర్భం దాల్చిన వెంటనే ఏఎన్ఎంలు తమ యాప్‌లో నమోదు చేసి నిరంతరం పర్యవేక్షించాలి. ఆ తర్వాత ప్రతి నెలా 9వ తేదీన ప్రతి ఆరోగ్య కేంద్రంలో జరిగే ప్రధాన మంత్రి మాతృవందన యోజన అనే కార్యక్రమంలో గర్భిణులకు అన్ని పరీక్షలు నిర్వహించి మాతాశిశు సంరక్షణ కార్డులో వివరాలు నమోదు చేయించాలి. కడుపులోని బిడ్డకు చేసే టిఫా స్కానింగ్ సైతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా చేయించాలి. ప్రతి నెలా గర్భిణికి అవసరమైన పరీక్షలు నిర్వహిస్తూ రక్తహీనత, హైబీపీ లేకుండా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలి. హైరిస్క్ గర్భిణిగా గుర్తించిన వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ కనపరచాలి. ఆశా, ఆరోగ్య కార్యకర్త పర్యవేక్షణలో గర్భిణిని పర్యవేక్షిస్తూ ప్రసవ తేదీకి వారం ముందుగానే ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి వైద్యుల పర్యవేక్షణలో సుఖప్రసవమయ్యేలా చూడాలి.

మూడు నెలల్లో 16 మాతృమరణాలు

గర్భిణుల పట్ల క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు, మెడికల్ ఆఫీసర్లు ఎంతో శ్రద్ధ తీసుకుంటూ పర్యవేక్షణ చేస్తున్నారని చెబుతున్నా వాస్తవంగా పూర్తిస్థాయిలో అవి అమలు కావడం లేదు. తూతూ మంత్రంగా గర్భిణులకు వైద్యసేవలు అందుతున్నాయి. ప్రతి నెలా 9వ తేదీన తీసుకెళ్లి వైద్యపరీక్షలు చేయించేవారే కరువయ్యారు. చాలా ఆసుపత్రుల్లో గర్భిణులకు టిఫా స్కానింగ్‌లు చేయడం లేదు. ఎక్కువ మంది కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఈ పరీక్ష చేయించుకుంటున్నారు. రెగ్యులర్‌గా వైద్యపరీక్షలు చేయించినట్లు, మందులు ఇస్తున్నట్లు, పరీక్షలు చేయిస్తున్నట్లు రికార్డుల్లో మాత్రమే నమోదవుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. గర్భిణిగా ఉన్న సమయంలో వారికి సూచనలు, సలహాలు ఇచ్చే వారే కరువయ్యారు. ఏఎన్ఎంలు ఎక్కువ శాతం యాప్‌లో వివరాలు నమోదు చేయడానికే సమయం కేటాయిస్తున్నారు. ఫలితంగా క్షేత్రస్థాయిలో 60 శాతం గర్భిణిలు రక్తహీనతతో తీవ్రంగా బాధపడుతున్నారు. దీంతో గత మూడు నెలల్లో ఏకంగా 16 మంది గర్భిణులు ప్రసవ సమయంలో కన్నుమూశారు. వీరిలో అధిక శాతం క్షేత్ర స్థాయిలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు తిరిగి చివరకు కర్నూలు, నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలలకు చికిత్సకు వచ్చి మరణించారు. ఇందులో దాదాపు అందరూ బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే ఉండటం గమనార్హం. వీరి మరణాలకు ప్రధాన కారణం బీపీ, రక్తహీనత, పలు రకాల అనారోగ్య సమస్యలు. కానీ ప్రసవ సమయంలో సహజంగా అందరికీ వచ్చే గుండె, ఊపిరితిత్తుల సమస్యల వల్లే మరణించారంటూ అధికారులు నివేదికలు తయారు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. క్షేత్రస్థాయిలో వీరికి మొదటి నుంచి వైద్యపరీక్షలు, వైద్యచికిత్సలు చేయించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని మృతుల కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరకు మాతృ మరణాలపై జిల్లా అధికారులు, వైద్యులు, సిబ్బంది అందరూ కూర్చుని చేసే సమీక్షలు సైతం మొక్కుబడిగా సాగుతుండటం విమర్శలకు తావిస్తోంది. కొన్నేళ్లుగా ఈ సమీక్షలు జరుగుతున్నా ఏ ఒక్కరిపైనా చర్యలు తీసుకున్న సాహసం చేయలేదు. అన్ని మరణాలు అరికట్టలేనివంటూ నివేదికలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గర్భిణిపై మొదటి నుంచి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే మరణాన్ని అరికట్టే అవకాశం ఉంది. అయితే, వైద్యులు, సిబ్బంది చిత్తశుద్ధితో ఆ పని చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి.



పత్తికొండ పట్టణంలోని బుడగ జంగాల కాలనీకి చెందిన మౌనిక(20) తొలి ప్రసవంలో భాగంగా నెలలు నిండటంతో గత నెల 30వ తేదీన భర్త మహేష్‌తో కలిసి స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ ఆమెకు సాధారణ ప్రసవం కోసం వైద్యులు ప్రయత్నించారు. ఆ సమయంలో ఆమెకు ఫిట్స్ రావడంతో కడుపులోనే శిశువు మృతి చెందింది. వైద్యులు మృత శిశువును తీసి తల్లిని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రెఫర్ చేశారు. ఆసుపత్రికి తీసుకెళ్లేలోపే మౌనిక కూడా మృతి చెందింది.

వీరి ఊపిరి ఆగింది



కర్నూలు జిల్లాలో కోసిగి పీహెచ్‌సీ పరిధిలో పి. అంజనమ్మ(26), ములుగుందం పీహెచ్‌సీ పరిధిలో కుమ్మరి విరూపాక్షమ్మ(22), ఆదోనిలోని ఇందిరానగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని హరిజన రోజా(28), దైవందిన్నె పీహెచ్‌సీ పరిధిలోని మాదిగ కుమారి(20), మాల సుజాత(21), బదినేహాలు పీహెచ్‌సీ పరిధిలోని ఎదవల్లి అంజలి(25), హుసేనాపురం పీహెచ్‌సీ పరిధిలోని కాశపోగు గిరిజన రాణి (26), దేవనకొండ పీహెచ్‌సీ పరిధిలోని తెర్నేకల్ ప్రవీణ(22), హుసేనాపురం పీహెచ్‌సీ పరిధిలోని బోయ అనసూయ(25), పత్తికొండలో బుడగ జంగాల కాలనీకి చెందిన మౌనిక(20)తో పాటు నంద్యాల జిల్లాలో మరో ఆరుగురు గర్భిణులు ప్రాణాలు కోల్పోయిన వారిలో ఉన్నారు.

అరికట్టలేని మరణాలపై ఏమీ చేయలేము



మాతృమరణాలకు చాలా కారణాలు ఉంటాయి. అందులో అరికట్టగలిగే మరణాలు, అరికట్టలేని మరణాలు అని రెండు ఉంటాయి. ఇందులో అరికట్టగలిగే మరణాలు పునరావృతంగా గాకుండా చర్యలు తీసుకుంటున్నాము. కానీ అరికట్టలేని మరణాల గురించి ఎవరూ ఏమీ చేయలేరు. ఇటీవల మాతృమరణాలపై జరిగిన సమీక్షకు కర్నూలులోని మనం హాస్పిటల్ వారు రాలేదు. వారికి షోకాజ్ నోటీసు జారీ చేశాము. మాతృమరణాల తర్వాత అనాథలైన వారి పిల్లలకు పెన్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాము.

– డాక్టర్ ఎల్.భాస్కర్, డీఎంహెచ్‌వో, కర్నూలు

మల్లన్న హుండీలో రూ.5.96 కోట్లు



భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది, శివసేవకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలోని ఉభయ దేవాలయాల్లో ఉన్న హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చంద్రవతి కల్యాణ మండపంలో లెక్కింపు చేపట్టగా 26 రోజులకు గాను మల్లన్నకు నగదు రూపంలో రూ.5,96,92,376 ఆదాయం వచ్చింది. బంగారం-232.400 గ్రాములు, వెండి-7.850 కేజీలు లభించాయి. అలాగే యూఎస్‌ఏ డాలర్లు-558, సౌదీ ఆరేబియా రియాల్స్-3, ఓమన్ బైసా-200, కువైట్ దినార్ 12, కత్తార్ రియాల్స్ 4, సింగపూర్ డాలర్లు 7, ఆస్ట్రేలియా డాలర్లు 60, కెనడా డాలర్లు 35, హంకాంగ్ డాలర్లు 10, యూఏపౌండ్స్ 5, యురోస్ 115, కెన్యా సిలింగ్స్ 50, ఫిలిఫిన్స్ పిస్కో 20, యూఏఈ దిర్హామ్ 5, జాంబియా క్వాచా 20, జపాన్ యెన్స్ 1000 తదితర విదేశీ కరెన్సీ కూడా హుండీ లెక్కింపులో లభించినట్లు ఈఓ వెల్లడించారు. పటిష్ట భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాలో నిర్వహించిన భక్తుల కానుకల లెక్కింపులో దేవస్థాన అన్ని యూనిట్ విభాగాల అధికారులు, సిబ్బంది, శివసేవకులు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణ యూనిట్ ప్రారంభం



క్యాన్సర్ నివారణ యూనిట్‌ను ప్రారంభిస్తున్న వైద్యాధికారులు

గోస్పాడు: నంద్యాల జిల్లా సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాన్సర్ నివారణ యూనిట్ ఏర్పాటు చేశారు. దీనిని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, ఆసుపత్రి సూపరింటెండెంట్ జిలానీ ప్రారంభించి మాట్లాడారు. క్యాన్సర్ వ్యాధి నిర్ధారణకు ఇక్కడి ఆసుపత్రిలో యూనిట్‌ను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి మంగళ, గురువారాల్లో ఓపీ నెంబరు 222లో స్పెషలిస్ట్ డాక్టర్లతో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక వేళ ఎవరికైనా వ్యాధి నిర్ధారణ అయితే చికిత్స కోసం పెద్దాసుపత్రులకు రెఫర్ చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ జఫరుల్లా, జిల్లా ప్రోగ్రాం అధికారి కాంతరావునాయక్, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ బాలీశ్వరి, డాక్టర్ ఆనంద్‌కుమార్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కర్నూలుకు మాజీ సీఎం జగన్ రాక



హెలిపాడ్‌ను పరిశీలిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, పార్టీ నేతలు

కర్నూలు (టౌన్): రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం కర్నూలుకు రానున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేంద్ర రెడ్డి కుమార్తె వివాహ రిసెప్షన్ వేడుకల్లో ఆయన పాల్గొంటారు. ఉదయం 10 గంటలకు బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.55 గంటలకు కర్నూలు ఏపీఎస్‌పీ గ్రౌండ్స్ హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బళ్లారి చౌరస్తా మీదుగా కర్నూలు నగర శివారులో ఉన్న జీఆర్‌సీ కన్వెన్షన్‌కు చేరుకుంటారు. వివాహ రిసెప్షన్‌లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించనున్నారు. అనంతరం 12.30 గంటలకు తిరిగి ఏపీఎస్‌పీ గ్రౌండ్స్‌కు చేరుకుని హెలికాప్టర్‌లో తాడేపల్లికి బయలుదేరుతారు.

హెలిపాడ్ పరిశీలన..

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలు పర్యటన నేపథ్యంలో ఏపీఎస్‌పీ క్యాంప్‌లోని ఏర్పాటు చేసిన హెలిపాడ్‌ను వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, పార్టీ నేతలు మంగళవారం పరిశీలించారు. కోడుమూరు ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్, తెర్నేకల్ సురేంద్ర రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ జిల్లా అధ్యక్షులు జీఆర్‌సీ కన్వెన్షన్‌ను పరిశీలించారు. స్థానిక పోలీసు అధికారులతో వారు మాట్లాడారు.

పరీక్షల సమయంలో ఒత్తిడికి గురి కావద్దు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ జనార్దన్‌రెడ్డి

పాణ్యం: విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికారాదని డీఈఓ జనార్దన్‌రెడ్డి సూచించారు. మంగళవారం కొండజుటూరు జెడ్పీహైస్కూల్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పదోతరగతి పరీక్షలు దగ్గర పడుతున్నాయన్నారు. ఇప్పటి నుంచే ప్రణాళికతో చదువుకోవాలని సూచించారు. ఆ దిశగా విద్యార్థులను సిద్ధం చేయాలని ఉపాధ్యాయులు ఆదేశించారు. ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెరగాలన్నారు. ఇందుకు వెనుకబడ్డ విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని చెప్పారు. ప్రస్తుతం ఎస్ఏ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించి ప్రతిభను అంచనా వేయాలన్నారు. అనంతరం స్కూల్‌లో అందిస్తున్న మంచినీరు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ విద్య, తదితర వాటిపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

సమన్వయంతోనే సుస్థిర అభివృద్ధి

ఆళ్లగడ్డ: సమన్వయంతో పని చేస్తేనే గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించగలమని నంద్యాల డివిజనల్ పంచాయతీ ఆఫీసర్ రాంబాబు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ఎంపీడీఓ మహబూబ్ ఖాన్ అధ్యక్షతన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బదికి ఏర్పాటైన రెండు రోజుల శిక్షణ తరగతులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ, అంబేడ్కర్ చిత్ర పటాలకు నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధికి నిర్మాణాత్మకంగా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఇందులో పేదరిక నిర్మూలన, మెరుగైన జీవనోపాధి, ఆరోగ్యవంతమైన గ్రామంగా తీర్చిదిద్దడం, పిల్లల సామర్థ్యాలు మెరుగు, తాగు, సాగుకు సరిపడా నీటి వనరులు సమకూర్చడం, మౌలిక వసతుల కల్పన, స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దడం, సామాజిక భద్రత కల్పించడం, వివిధ పథకాల్లో అందరికీ భాగస్వామ్యం కల్పించడం, లింగ సమానత్వం సాధించడం వంటివి ఉన్నాయని వివరించారు.

కూటమి నాయకుల కనుసన్నల్లోనే డీసీ ఎన్నికలు

నంద్యాల(రూరల్): ప్రజాస్వామ్య బద్ధంగా జరగాల్సిన సాగునీటి సంఘాల ఎన్నికలను కూటమి ప్రభుత్వం అంతా కుట్రమయం చేసింది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని పోటీలో ఎవరూ పాల్గొనకుండా బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడింది. సంఘాల్లో కేవలం టీడీపీ మద్దతుదారులే ఉండాలనే లక్ష్యంతో అధికారులను రంగంలోకి దింపి ఎన్నికలు ఏకపక్షంగా జరిగేలా చూసుకుంది. తాజాగా మంగళవారం జిల్లాలో కేసీ కెనాల్, ఎస్సార్బీసీ, తెలుగుగంగ ప్రాజెక్టులకు సంబంధించిన 25 డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ)ఎన్నికలు సైతం అదే విధంగా జరిగాయి. కూటమి నాయకులు సూచించిన వారే అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఈమేరకు వారి పేర్లను సంబంధింత శాఖల అధికారులు ప్రకటించారు.

చిక్కిన మొసలి



బోనులో బంధించిన మొసలి

పాములపాడు: కొన్ని రోజులుగా కేసీ కెనాల్‌లో సంచరిస్తూ భయాందోళనకు గురి చేస్తున్న మొసలిని ఎట్టకేలకు అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. ఈనెల 12న మండలంలోని బానకచెర్ల గ్రామం సమీపంలో సాగర్ పవర్ హౌస్ వద్ద మొసలి కనిపించింది. ముందు జాగ్రత్తగా కేసీ కెనాల్ వెంట గస్తీ నిర్వహించారు. ప్రస్తుతం కెనాల్‌లో నీరు కూడా తగ్గడంతో మొసలిని పట్టుకునేందుకు అనువైంది. మంగళవారం బోనును లోపలికి దించి దానిని అందులో బంధించి వెలుగోడు రిజర్వాయర్ వద్ద వదిలినట్లు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ఖాన్ తెలిపారు.

హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

- అధికారులకు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర సంక్షేమ వసతి గృహాల్లో పిల్లలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత సంక్షేమ అధికారులు, ఇంజినీర్లను ఆదేశించారు. ఈ అంశంపై వారితో మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 37 ఎస్సీ, బీసీ ఇతర సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన పనులకు పరిపాలన ఉత్తర్వులు పొందాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గృహంలో మరుగుదొడ్లు, తాగునీరు, మస్కిటో నెట్‌లు, విద్యుత్ పరికరాలు, తలుపులు, పై కప్పు లీకేజీ, ఫ్లోరింగ్, ప్రహరీ గోడలు తదితర పనులకు ప్రభుత్వం రూ.8.29 కోట్లను విడుదల చేసిందన్నారు. ఆన్‌లైన్‌లో సంబంధిత పనులకు టెండర్లు నిర్వహించి జనవరిలో పనులు ప్రారంభం చేయాలన్నారు. పూర్తి చేసిన పనులకు మార్చి 1 లోపు బిల్లులు సమర్పించాలన్నారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, ట్రైబల్ వెల్ఫేర్, ఏపీఈడబ్ల్యూఐడీసీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, సమగ్ర శిక్ష అభియాన్ ఇంజినీర్లు, వసతి గృహాల సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల భద్రతా ప్రమాణాలు పాటించాలి

జిల్లాలో రహదారుల భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రహదారుల భద్రత సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను అరికట్టి ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించాలన్నారు. నంద్యాల పట్టణంలో గుర్తించిన 23 బ్లాక్ స్పాట్‌లలో ఎలాంటి చర్యలు చేపట్టారని కలెక్టర్ ఆరా తీశారు. రహదారుల భద్రత చర్యలపై ఇకనుంచి నెలకోసారి సమావేశాలు నిర్వహిస్తానన్నారు. జిల్లాలోని ఏడు జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల్లో సంయుక్త తనిఖీలు నిర్వహించి ప్రమాదకర ప్రదేశాలను గుర్తించాలన్నారు. తర్వాత అక్కడ తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్టీసీ బస్టాండు, ప్రభుత్వ సర్వజన వైద్యశాల తదితర ముఖ్య ప్రదేశాల్లో రహదారుల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ ప్రధాన రహదారిలో రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్ల పొదలను తొలగించడంతో పాటు స్పీడ్ బ్రేకర్ల ముందు, వెనుక భాగాల్లో పెయింటింగ్ వేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించి హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు పరిహారం చెల్లింపుపై జిల్లాలోని డీఎస్పీలు ఆర్డీఓలతో సమన్వయం చేసుకొని నివేదికలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్ అండ్‌బీ ఎస్ఈ శ్రీధర్ రెడ్డి, డీటీసీ ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుంటూరు వాసి మృతి


మృతి చెందిన షాజుద్దీన్

ఆత్మకూరు రూరల్: స్థానిక మైనారిటీ కాలనీ వద్ద గుంటూరు జిల్లా కాకమాను మండలం అయ్యలూరు గ్రామానికి చెందిన షాజుద్దీన్ (51) మృత్యువాత పడ్డాడు. మంగళవారం స్థానికుల నుంచి సమాచారం తెలుసుకున్న అర్బన్ సీఐ రాము అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఘటనా స్థలంలో లభించిన వస్తువుల ఆధారంగా గుంటూరు వాసిగా గుర్తించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశామని, మృతికి కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉందని సీఐ తెలిపారు.

ఒకేషనల్ కాలేజీల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన అధ్యక్షుడు కె.వేణుగోపాల్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్లు

కర్నూలు సిటీ: ప్రైవేటు ఒకేషనల్ జూనియర్ కాలేజీల యాజమాన్యాల సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరంలోని ఓ కాలేజీలో జరిగిన సంఘం సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా కె.వేణుగోపాల్ (కాంకర్ వొకేషనల్ కాలేజీ కరస్పాండెంట్, కర్నూలు), కార్యదర్శిగా ఎస్.దేవదానం(నోబెల్ కాలేజీ కరస్పాండెంట్, ఆదోని), ట్రెజరర్‌గా సునీల్(సృజన కాలేజీ కరస్పాండెంట్, కర్నూలు)తోపాటు ఉపాధ్యక్షులుగా పవన్‌కుమార్(క్రిష్ణవేణి వొకేషనల్ కాలేజీ కరస్పాండెంట్, కర్నూలు), జాయింట్ సెక్రటరీగా చాంద్‌బాషా(ఇస్లామియా ఒకేషనల్ కాలేజీ, కర్నూలు), గౌరవ అధ్యక్షులుగా విరూపాక్షయ్య(పద్మావతి వొకేషనల్ కాలేజీ, ఆదోని) ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం చేత సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి శాంతి కుమార్, సెక్రటరీ బాలరాజు, ట్రెజరర్ శ్రీనివాసులు ప్రమాణస్వీకారం చేయించారు.

కాపర్ వైర్ దొంగల అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం గ్రామంలో సోలార్ కంపెనీలోని కాపర్ వైర్‌ను చోరీ చేసిన అదే గ్రామానికి చెందిన తలారి మహేంద్ర, పాలూరు ఎల్లయ్య, శీలం మహేష్, నంద్యాల వీసీ కాలనీకి చెందిన షేక్ ఫరూక్, నంద్యాల చుక్కపేటకు చెందిన ఇండ్ల మధుప్రసాద్, నందమూరి నగర్‌కు చెందిన షేక్ అక్బర్‌బాషాలను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాలు.. ఈనెల 9 రాత్రి గుర్తు తెలియని దుండగులు సోలార్ కంపెనీలో ప్యానెల్‌కు ఉన్న 3,200 మీటర్ల కాపర్ బుల్‌ను చోరీ చేశారు. స్టోర్ మేనేజర్ కొలిమ మన్సూర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈక్రమంలో ఈనెల 16న పిన్నాపురం గ్రామం వద్ద ఉన్న వాటర్ ట్యాంక్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా నేరం అంగీకరించారన్నారు. వారిచ్చిన సమాచారంతో మిగతా వారిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి ఆటో, 4 సెల్‌ఫోన్లు, కత్తెర, కాల్చిన వైర్ నుంచి తీసిన 240 కేజీల కాపర్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, ఏఎస్‌ఐ నరసింహులు, మధుసూదన్ పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాల్లో ‘నవోదయం’

- ఆరవ తరగతిలో సీటు సాధిస్తే ఇంటర్ వరకు ఉచిత విద్యాబోధన
- జనవరి 18న ప్రవేశ పరీక్ష
- కర్నూలు జిల్లాలో 13, నంద్యాల జిల్లాలో 9 పరీక్ష కేంద్రాల ఏర్పాటు

గ్రామీణ ప్రాంతంలో ప్రతిభ ఉన్న విద్యార్థులకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యనందిస్తోంది బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం. సామాన్య, మధ్య తరగతి వర్గాల వారికి ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్య దూరమవుతున్న పరిస్థితుల్లో.. కార్పొరేట్‌కు దీటుగా ప్రాథమిక స్థాయి నుంచే విద్యనందిస్తూ విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతోంది. ఇక్కడ చదివిన విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుంటుండటంతో ఇందులో సీటు కోసం ఏడాదికేడాదికి పోటీ పెరుగుతోంది. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అర్థవంతమైన బోధన చేస్తూ మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు.

– ఎమ్మిగనూరురూరల్


బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం ముఖద్వారం

నవోదయ విద్యాలయంలో సీటు వచ్చిందంటే చాలు తమ బిడ్డ భవిత బంగారమేనని తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల విద్యార్థులకు బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 80 సీట్లు అందుబాటులో ఉండగా బాలికలకు 30 శాతం సీట్లు, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, దివ్యాంగులకు 3 శాతం సీట్లు కేటాయిస్తున్నారు. మొత్తం 80 సీట్లలో 75 శాతం అంటే 60 సీట్లను గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు 20 సీట్లు పట్టణ ప్రాంతాల విద్యార్థులకు కేటాయిస్తారు. అయితే 2025–2026 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి 6,085 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.

అత్యుత్తమ విద్యా ప్రమాణాలు

నవోదయ విద్యాలయంలో సీబీఎస్‌ఈ కూడిన అత్యుత్తమ విద్యా బోధన అందిస్తారు. సువిశాల ప్రాంగణం, ఆహ్లాదకర వాతావరణం, ఒత్తిడి లేని విద్య, విద్యార్థి కేంద్రీకృత అత్యుత్తమ విద్యాబోధన, అధునాత కంప్యూటర్ ల్యాబ్, పోషక విలువలతో కూడిన ఆహారం, మానసికోల్లాసానికి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా, ఎన్‌సీసీ తదితర అంశాలు బోధిస్తున్నారు. నిపుణులైన అధ్యాపకులు ఉండటంతో సీబీఎస్‌ఈ పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తూ ప్రత్యేకతను చాటుకుంటోంది.

ఆటలు...సాంస్కృతిక కార్యక్రమాలు

విద్యార్థుల శారీరక దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలను ప్రోత్సహిస్తున్నారు. నవోదయ ప్రాంగణంలో దాదాపు 37 ఎకరాల్లో సువిశాల క్రీడా ప్రాంగణం ఉంది. బనవాసి నవోదయ విద్యార్థులు రీజినల్ స్థాయి నుంచి జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తున్నారు. క్రమశిక్షణ, విలువలు పెంపొందించేందుకు ఎన్‌సీసీ, నేషనల్ గ్రీన్ కోర్ శిక్షణ ఉంటుంది. అలాగే స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో 30 మంది బాలికలు, 30 మంది బాలురు శిక్షణ పొందుతుంటారు. ఆసక్తి కలిగిన విద్యార్థులకు సంగీతం, నృత్యం, చిత్రలేఖనం తదితర అంశాల్లోనూ శిక్షణ అందిస్తున్నారు.


నవోదయలో ఎన్‌సీసీ శిక్షణలో విద్యార్థులు


స్కౌట్స్ అండ్ గైడ్స్‌పై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

విశాల గంథ్రాలయం



బనవాసి నవోదయంలో విద్యార్థుల సౌకర్యార్థం సైన్స్, గణితం, సాహిత్యం తదితర అంశాలకు సబంధించిన 10 వేలకు పైగా పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచారు. వార్తాంశాలపై అవగాహన కోసం పలు తెలుగు, ఆంగ్ల ప్రతికలను విద్యార్థులకు అందుబాటులో ఉంచుతున్నారు. గంథ్రాలయంలో విద్యార్థు తమ జ్ఞానాన్ని పెంపొందించుకుంటారు.

అంతా ఉచితమే..

నవోదయ విద్యాలయంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉచితమే. 6 నుంచి 12వ తరగతి వరకు అత్యుత్తమ విద్య అందిస్తారు. భోజనం, వసతి, యూనిఫాం, బూట్లు, పుస్తకాలను అందిస్తారు. విద్యార్థుల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆరోగ్య పర్యవేక్షణ కోసం స్టాఫ్ నర్స్ అందుబాటులో ఉంటారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.

వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వచ్చే నెల 18న ప్రవేశ పరీక్ష జరగనుంది. పరీక్షకు నంద్యాల జిల్లాలో 9 కేంద్రాలు, కర్నూలు జిల్లాలో 13 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్‌టికెట్స్‌ను https://cbseitms.rcil.gov.in/nvs వెబ్ సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. విద్యార్థులకు ఇక మిగిలింది ప్రవేశ పరీక్షకు 30 రోజులు మాత్రమే. పట్టుదలతో చదివితే సీటు సంపాదించవచ్చు.

అధునాతన కంప్యూటర్ ల్యాబ్



మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు అత్యుత్తమ విద్యా బోధన చేసేందుకు శాంసంగ్ స్మార్ట్ క్లాస్ రూం ఏర్పాటు చేశారు. 80 ల్యాప్ ట్యాప్‌లు, 115 ట్యాబ్‌లు విద్యార్థులకు అందుబాటులో ఉంచి వేగవంతమైన అంతర్జాల సౌకర్యం కల్పించారు. డిజిటల్ క్లాస్ రూమ్స్‌లో నిపుణులైన అధ్యాపకులతో విద్యాబోధన అందిస్తున్నారు.

పరీక్ష విధానం

నవోదయ ప్రవేశ పరీక్ష 100 మార్కులకు 80 ప్రశ్నలు ఉంటాయి. సమయం రెండు గంటలు దివ్యాంగులకు అదనంగా 40 నిమిషాలు సమయం ఇస్తారు.

పరీక్ష	ప్రశ్నల సంఖ్య	మార్కులు	వ్యవధి
మేథాశక్తి	40	50	60 నిమిషాలు
గణితం	20	25	30 నిమిషాలు
భాష పరీక్ష	20	25	30 నిమిషాలు

పటిష్ట ప్రణాళిక



పటిష్ట విద్యా ప్రణాళిక రూపొందించుకుని అమలు చేస్తున్నాం. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. ఒత్తిడికి గురికాకుండా మానసిక నిపుణల చేత కౌన్సెలింగ్ ఇప్పిస్తాం. కేరీర్ గైడెన్స్ సెల్ ఏర్పాటు చేశాం. న్యూట్రిషన్ ఆధ్వర్యంలో పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తున్నాం. ప్రవేశ పరీక్షను కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 22 కేంద్రాల్లో నిర్వహిస్తున్నాం.

– ఇ.పద్మావతి, ప్రిన్సిపాల్, బనవాసి నవోదయ

పెన్షనర్ల అభ్యున్నతికి చర్యలు తీసుకుంటాం

- జాతీయ పెన్షనర్ల దినోత్సవంలో జిల్లా ట్రెజరీ డీడీ రామచంద్రరావు

కర్నూలు (అగ్రికల్చర్): పెన్షనర్ల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రరావు తెలిపారు. జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని మంగళవారం అబ్బాస్‌నగర్‌లోని పెన్షనర్ల సంక్షేమ సంఘం కార్యాలయ ప్రాంగణంలో జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి ఆధ్వర్యంలో, కృష్ణానగర్‌లో రిటైర్డ్ సీనియర్ సిటిజన్ సర్వీస్ సొసైటీలో జె.విశ్వేశ్వరయ్య ఆధ్వర్యంలో, కర్నూలు లయన్స్ క్లబ్‌లో రిటైర్డ్ తహసీల్దారు మురారి శంకరప్ప ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ముందుగా ఉద్యోగులకు పెన్షన్ సదుపాయం ఏర్పడటానికి న్యాయ పోరాటం చేసిన ధరమ్ స్వరూప్ నకారా, సుప్రీమ్‌కోర్టు మాజీ చీఫ్ జస్టిస్ వైవీ చంద్రచూడ్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వయోవృద్ధులకు చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. 75 ఏళ్లు నిండిన పెన్షనర్లను సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో పాల్గొన్న జిల్లా ట్రెజరీ డీడీ రామచంద్రరావు మాట్లాడుతూ పెన్షనర్లు జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28లోపు లైఫ్ సర్టిఫికెట్లు ట్రెజరీలకు సమర్పించేలా అవగాహన కల్పించాలని విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం నేతలను కోరారు. రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను ట్రెజరీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నామన్నారు. అనంతరం జిల్లా ట్రెజరీ డీడీ రామచంద్రరావు, ఏటీఓ జయలక్ష్మి, కర్నూలు డివిజన్ సబ్ ట్రెజరీ అధికారి రఘువీర్‌లను సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో పెన్షనర్ల సంఘం ప్రతినిధులు సుబ్బారావు, మహబూబ్‌బాషా, నాగేశుడు పాల్గొన్నారు.


పెన్షనర్లను సత్కరిస్తున్న దృశ్యం

ప్రేమ జంటపై వేటకొడవళ్లతో దాడి

- తప్పించుకుని పారిపోయిన యువతి
- యువకుడికి తీవ్ర గాయాలు


అరవింద్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

గోనెగండ్ల: మండల పరిధిలోని గాజులదిన్నె ప్రాజెక్టు సమీపంలో ఉన్న ఎల్లెల్సీ కాలువ వద్ద సేద తీరుతున్న ప్రేమ జంటపై గుర్తు తెలియని దుండగులు వేటకొడవళ్లతో దాడి చేశారు. యువతి తప్పించుకుని పారిపోగా, దుండగుల చేతిలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఎమ్మిగనూరుకు చెందిన అరవింద్ స్థానికంగా ఓ కళాశాలలో డిస్టెన్స్ డిగ్రీ చదువుతున్నాడు. కొంత కాలంగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఇద్దరూ కలిసి మంగళవారం ఉదయం గాజులదిన్నె ప్రాజెక్టు సమీపంలోని ఎల్లెల్సీ కాలువ వద్దకు చేరుకున్నారు. అక్కడ కబుర్లు చెప్పుకుంటున్న క్రమంలో ముగ్గురు గుర్తు తెలియని యువకులు వేట కొడవళ్లతో దాడి చేశారు. భయంతో యువతి పారిపోగా.. యువకులు అరవింద్‌పై దాడి చేశారు. కాపాడండి అంటూ కేకలు వేయడంతో చుట్టు పక్కల పొలాల్లోని రైతులు, కూలీలు పరుగున వచ్చి రాళ్లు రువ్వడంతో ముగ్గురూ అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం తెలుసుకున్న సీఐ గంగాధర్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో కర్నూలు ఆస్పత్రికి తరలించారు. యువతి కుటుంబ సభ్యులు దాడి చేశారా? లేక మరెవరైనా దాడి చేశారా అనేది విచారణలో తెలియాల్సి ఉందని సీఐ తెలిపారు.

టీడీపీ నాయకుడి ఇంటి వద్దే బియ్యం పంపిణీ


టీడీపీ నాయకుడి ఇంటి వద్ద బియ్యాన్ని నిల్వ చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): కల్లూరు మండలం కె.మార్కాపురంలో ఓ టీడీపీ నాయకుడి ఇంటి వద్దే రేషన్‌బియ్యం పంపిణీ చేస్తున్నారు. డీలర్ మద్దిలేటిని టీడీపీ నాయకులు అధికారులపై ఒత్తిడి తెచ్చి రెండు రోజుల క్రితం సస్పెండ్ చేయించారు. దీంతో పర్ల డీలర్ మహానందికి అధికారులు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అతని ద్వారా టీడీపీ నాయకుడు తన ఇంటిలోనే బియ్యాన్ని నిల్వ చేసుకుని అక్కడి నుంచే ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. కాగా కొందరు కార్డుదారులు టీడీపీ నాయకుడి ఇంటికి వెళ్లి బియ్యం తెచ్చుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడంలేదని పలువురు వాపోతున్నారు.

జాతీయ స్థాయిలో రాణించాలి

- ఎస్పీ బిందు మాధవ్


క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు: మరింత ప్రతిభ కనపరచి అంతర్జాతీయలో రాణించి రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరు, ప్రఖ్యాతలు సాధించాలని ఎస్పీ బిందు మాధవ్ క్రీడాకారులను అభినందించారు. ఈనెల 9 నుంచి 15వ తేదీ వరకు ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి కరాటే అండర్–17 (66 కిలోల విభాగం) పోటీల్లో కర్నూలు సీసీఎస్ విభాగం హెడ్ కానిస్టేబుల్ వాసు కుమారుడు మన్నెపు వెంకటదినేష్ స్వర్ణం సాధించాడు. అలాగే కర్నూలు జిల్లాకు చెందిన కె.హవీష్ పి.హేమంత్ కుమార్‌రెడ్డి, సాయి అక్షిత, రుషికేష్, యస్మితలు వెండి, కాంస్య పతకాలు సాధించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ బిందు మాధవ్ వారిని అభినందించారు. జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ కరాటే పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు మొదటిసారి స్వర్ణ పతకం సాధించడం గర్వకారణమని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, మూడో పట్టణ సీఐ శేషయ్య, ఆర్‌ఐ నారాయణ, కోచ్ జగదీష్ పాల్గొన్నారు.

పెచ్చులూడిన పాఠశాల పైకప్పు

- విద్యార్థులకు తప్పిన ప్రమాదం

ఆలూరు రూరల్: మండలంలోని కమ్మరచేడు జెడ్పీ పాఠశాల తరగతి గది పైకప్పు పెచ్చులు ఊడి పడ్డాయి. సోమవారం పాఠశాల సమయం ముగిసిన తర్వాత ఘటన జరగడంతో విద్యార్థులకు ప్రమాదం తప్పింది. విద్యార్థులు లేని సమయంలో పెచ్చులూడి పడడంతో ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం ఎంఈఓ–2 చిరంజీవి రెడ్డి పాఠశాల హెచ్‌ఎం కరిబసప్పతో కలిసి తరగతి గదిని పరిశీలించారు. పైకప్పు మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.


పెచ్చులూడిన పైకప్పును పరిశీలిస్తున్న ఎంఈఓ

గొర్రెల కాపరి దారుణహత్య


హత్యకు గురైన షేక్ హజ్రత్ వలి

ఆత్మకూరురూరల్: మండలంలోని ఇందిరేశ్వరం చెంచు గూడెం సమీపంలో సోమవారం రాత్రి గొర్రెల కాపరి షేక్ హజ్రత్ వలి(25) దారుణహత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీపతిరావుపేటకు చెందిన షేక్ హజ్రత్‌వలి వరసకు బావ అయిన ఇందిరేశ్వరానికి చెందిన షేక్ షఫితో కలసి గొర్రెల మంద వద్ద పూటుగా మద్యం తాగారు. అనంతరం నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి మెలకువ వచ్చిన షఫి.. గాఢ నిద్రలో ఉన్న తన బావ షేక్ హజ్రత్‌వలిని గొడ్డలితో నరికి హత్య చేశాడు. అనంతరం హజ్రత్ వలి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా విషయం చెప్పి అక్కడి నుంచి పరారయ్యాడు. మంగళవారం ఉదయమే ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సీఐ రాము ఎదుట లొంగిపోయాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

మందుబాబుకు జైలు శిక్ష

బండి ఆత్మకూరు: మండంలోని ఏ.కోడూరు గ్రామానికి చెందిన మందుబాబు వంశీకి నంద్యాల సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్ రెడ్డి 10 రోజుల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారని ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. వంశీ గ్రామంలో మద్యం తాగి చుట్టుపక్కల వారిని దూషిస్తుండటంతో స్థానికుల నుంచి సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికెళ్లి అరెస్ట్ చేశారు. కేసు నమోదుచేసి నిందితుడిని నంద్యాల సెకండ్ క్లాస్ కోర్టులో హాజరు పరచగా జడ్జి జైలు శిక్ష విధించారని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

- క్షతగాత్రులను పరామర్శించిన అధికారులు, రాజకీయ నాయకులు

ఓర్వకల్లు/కర్నూలు(హాస్పిటల్): కర్నూలు–కడప జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు విద్యార్థులు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని కన్నమడకల గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ స్వాములు ప్రతి రోజు కన్నమడకల, ఓర్వకల్లు గ్రామాల విద్యార్థులను స్థానిక మోడల్ స్కూల్‌కు తరలించేవాడు. రోజు మాదిరిగానే విద్యార్థులను ఎక్కించుకుని పాఠశాలకు బయలుదేరాడు. మార్గమధ్యలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను అధిగమిస్తుండగా బేతంచెర్ల నుంచి కర్నూలు వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి ఆటోను ఢీకొంది. ప్రమాదంలో ఆటోలోని విద్యార్థులు సుమంత్, రెహాన, మనోజ్, ధరణి, కిరణ్‌తోపాటు ఆటో డ్రైవర్ స్వాములు గాయపడ్డారు. స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరు ను పరిశీలించారు. క్షతగాత్రులను 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రోడ్డుకు ఇరువైపులా సర్వీసు రోడ్డు పూర్తి చేయా లని పలుమార్లు విన్నవించినా హైవే అధికారులు పట్టించుకోవడం లేదని ఘటనా స్థలంలో సీపీఎం, సీపీఐ నాయకులు నిరసనకు దిగారు.


గాయపడిన విద్యార్థులను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం


బాధితుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పలువురి పరామర్శ

ప్రమాదంలో గాయపడిన విద్యార్థులను కర్నూలు పెద్దాస్పత్రిలో అధికారులు, రాజకీయనాయకులు పరామర్శించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి సుమంత్ తలకు, పొట్టకు గాయాలయ్యాయని, మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని కలెక్టర్‌కు వైద్యులు వివరించారు. అందరికీ మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు ఆదేశాలు జారీ చేశారు. అంతకుముందు విద్యార్థులను జాయింట్ కలెక్టర్ డాక్టర్ నవ్య, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు ఆర్‌డీఓ సందీప్‌కుమార్, డీఈఓ శామ్యూల్ పాల్ వేర్వేరుగా పరామర్శించి వారి ఆరోగ్యం గురించి ఆరా తీశారు.


గాయపడిన విద్యార్థిని పరామర్శిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, అధికారులు